విద్యుత్ స్తంభం ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామం బీసీ కాలనీ వద్ద సోమల- కందూరు ప్రధాన రహదారి పక్కన ఒరిగిపోయిన విద్యుత్ స్తంభంపై ఈనెల 26వ తేదీ ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ట్రాన్స్కో ఏఈ మహేందర్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి వైర్లు లాగి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. సమస్య పరిష్కారం కావడంతో బీసీ కాలనీ ప్రజలు ప్రజాశక్తికి అభినందనలు తెలియజేశారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసిన దృశ్యం

నాలుగు రోజుల్లో మామిడి ధర ఖరారు..

రైతు సంఘాలకు కలెక్టర్ హామీ


రైతు సంఘాల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి రకానికి నాలుగు రోజుల్లో ధర నిర్ణయం చేస్తామని రైతు సంఘాల నేతలకు, మామిడి ధరల స్థిరీకరణ కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం చిత్తూరు నగర కార్యాలయంలో మామిడికి గిట్టుబాటు ధర విషయమై చిత్తూరు జిల్లా రైతు సంఘాలు, మామిడి రైతులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.జనార్ధన్, రైతు నాయకులు ఆనంద్ నాయుడు, హరిబాబు చౌదరి, మునీశ్వర్ రెడ్డి, భారతి, కార్మిక సంఘం నాయకులు గంగరాజు, నాగరాజు పాల్గొని ప్రసంగించారు. అనంతరం సభ్యులతో మామిడి ధరల స్థిరీకరణ కమిటీ ఏర్పాటుచేసి దశల వారిగా పోరాట కార్యక్రమంను రూపొందించారు. అందులో భాగంగా తొలుత జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తదుపరి ఈనెల 31న స్థానిక శాసన సభ్యులకు, ఎంపీలకు వినతిపత్రాలు సమర్పించాలని తీర్మానించారు. ప్రభుత్వ స్పందన బట్టి భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రత చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

తోతాపురికి కిలోకు రూ.30లు మద్దతు ధర ఇవ్వాలి..

తోతాపురి మామిడి కి కిలోకు రూ.30 మద్దతు ధర కల్పించాలని, గుజ్జు యజమానులు నుండి రూ.20 ప్రభుత్వ ప్రోత్సాహక నిధి నుండి మరో రూ.10లు అందజేయాలని పేర్కొన్నారు. రైతులకు మామిడి ఉత్పత్తికి రూ.15లు ఉత్పత్తి ఖర్చు అవుతున్న నేపథ్యంలో రూ.30లు ధర ఇవ్వడం భావ్యమని పేర్కొన్నారు. జిల్లాకు మామిడి బోర్డ్ ఏర్పాటు చేయాలని, బేనీషాకను రైతు బజార్లో అమ్మించేందుకు కృషి చేయాలని తద్వారా కిలోకి రూ.50ల చొప్పున ధర కల్పించాలని, సంప్రదింపుల కమిటీలో రైతు ప్రతినిధులకు చోటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, రైతు ప్రతినిధులు నాగరాజు నాయుడు, రాజేందర్ రెడ్డి, మస్తానయ్య చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాలు, మామిడి ధరల స్థిరీకరణ కమిటీ సభ్యులు

సీఎంను కలిసిన ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి- ఐరాల: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ బుధవారం కడపలో రెండోవరోజు జరుగుతున్న తెలుగుదేశం మహానాడు వేడుకలో మర్యాద పూర్వకంగా కలిసి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పూతలపట్టు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. పూతలపట్టు నియోజకవర్గం మరింత అభివృద్ధి కార్యాచరణలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, ప్రాజెక్టులు తదితర అంశాలపై ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు కూడా నియోజకవర్గం అభివృద్ధి సానుకూలంగా స్పందించారు.

ముఖ్యమంత్రికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించిన మురళీమోహన్

హైరిస్క్ ఏరియాలో పనిచేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో మగ ఆరోగ్య కార్యకర్తలకు ఎంపిహెచ్ఎలకు మొత్తం 92 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి హైరిస్క్ ఏరియాలకు ఆర్డర్స్ ఇవ్వడమైనది. వారివారి డ్యూటీస్ కొత్త ప్రదేశాలలో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, స్థానిక సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలకు నియామక పత్రాలు అందిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ

ఉగ్రవాదాన్ని వ్యతిరేకించాలి..

ప్రశాంత్ నగర్‌లో కాలువలు ఏర్పాటు చేయాలి
సమైక్యతా యాత్రలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు కలెక్టరేట్‌కి కొత్తపేట దూరంలో ఉన్న ప్రశాంత్ నగర్‌లో మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని, మతసామరస్యాన్ని కాపాడాలని సిపిఎం నాయకులకు చిట్టెమ్మ ఆధ్వర్యంలో బుధవారం సమైక్యత యాత్ర నిర్వహించడం జరిగింది. ఈ యాత్రలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ ప్రశాంత్ నగర్‌లో దాదాపు ఐదు వీధులలో రోడ్లు ఇరువైపులా మురుగునీటి కాలువలు లేక మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ దోమలకు నిలయంగా మారిందని, ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు ఇరు వైపులా కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు దేశంలో జరుగుతున్న ఉగ్రవాది దాడులను ఖండించాలని, దేశ సమైక్యతకు అందరూ కలిసి రావాలని సమైక్యత యాత్ర చేస్తున్నామని తెలిపారు. కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదంను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న మతోన్మాద బిజెపి ప్రభుత్వం ఉగ్రవాదానికి కూడా మతాన్ని అడ్డుపెట్టి రెచ్చగొట్టే పనిచేయడం దుర్మార్గమన్నారు. లౌకికదేశంలో కులాలకు, మతాలకు అతీతంగా పరిపాలన ఉండాలని తెలిపారు. వ్యాపారం కోసం పాకిస్తాన్, భారత్‌లను ఆడుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. భారతదేశం ప్రజలపై భారాలు మోపడానికి భారతపై ఆంక్షలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యతిరేకించక పోవడం దారుణమన్నారు. అమెరికా తీరుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈ సమైక్యత యాత్రలు కొనసాగిస్తున్నమని ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను రాష్ట్రంలో ఉన్న కూటమి పార్టీలు వ్యతిరేకించాలని కోరారు. అలాగే జిల్లాలో ఉన్న ప్రజా సమస్యలపై దశలవారి పోరాటాలకు సిపిఎం సిద్ధమవుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, కళావాణి, సెల్వి, చిత్ర, సందీప్, కాలనీలో మహిళలు పాల్గొన్నారు.

అమెరికా మాటకు వత్తాసు పలకడం మానుకోవాలి
సిపిఎం జిల్లా నాయకులు కాంచీవరం సురేంద్ర

బంగారుపాళ్యం: అమెరికా మాటలకు వత్తాసు పలకడం మానుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు కాంచీవరం సురేంద్ర అన్నారు. బుధవారం మండలంలోని బంగారుపాళ్యం, తగువారిపల్లి

బంగారుపాళ్యంలో..

గ్రామాల్లోని వీధిలో సమైక్య యాత్ర కరపత్రాలను పంపిణీ కార్యక్రమం సిఐటియు జిల్లా నాయకులు మధు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ పహల్గాలో జరిగిన ఉగ్రదాడిని ఒక జాతికి అంకితం చేయడం చాలా దారుణమని, రాష్ట్రంలోనూ ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని వారిని కాపాడే ప్రయత్నంలో ఒక ముస్లిం మృతి చెందడం గుర్తించాలని, బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ముసుగులో మతతత్వ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. దీనికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం చాలా దారుణమమన్నారు. అగ్రరాజ్యం అమెరికా ఆమోదం తెలిపిన వెంటనే ఇక్కడ యుద్ధంలో విరమించుకుంటున్నట్టు ప్రకటన చేయడం అగ్రరాజ్యానికి తొత్తుగా ఉండటానికి నిదర్శనమని ఆరోపించారు. మతోన్మాద రాజకీయాలను విడనాడి లౌకిక రాజ్యాంగం చేసి ప్రజల స్వేచ్ఛ జీవితాన్ని అనుభవించే విధంగా చూడాలని ఉద్దేశంతో సమైక్యత యాత్ర కార్యక్రమంను సిపిఎం ప్రారంభించిందని దీనికి గ్రామంలో గల ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం మసీదుల్లో కరపత్రాలను పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ కార్యదర్శి శంకరన్, మండల నాయకులు అబ్దుల్లా, శంకరాచారి, దాసు పాల్గొన్నారు.

యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగ పై అవగాహన పెంచేందుకు మండల, గ్రామస్థాయి వరకు కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. యోగాంధ్ర-2025 కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 11 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాలకు సంబంధించి ప్రతిఒక్కరికి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో విరివిగా యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్లు చేయించాలన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు ప్రతి ఒక్కరికి యోగపై అవగాహన కలిగేలా ప్రతి ఒక్కరిని యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. జిల్లా స్థాయిలో యోగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. నేటి నుంచి గ్రామస్థాయిలో యోగా పోటీలు ప్రారంభించాలన్నారు. రోజువారి కార్యక్రమాలను సంబంధిత వెబ్సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అలాగే యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌ను యోగాంధ్ర.ఏపీ.జివోవి.ఇన్‌లో చేసుకోవాలన్నారు. అలాగే యోగాంధ్ర క్యూఆర్ కోడ్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. జిఎస్‌డబ్ల్యూఎస్ యాప్‌లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని తెలిపారు. ఈఅవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పెద్దఎత్తున యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్నివర్గాల ప్రజలకు సూచించారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ఎన్‌టిఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి: కలెక్టర్

చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నందమూరి తారక రామారావుని ప్రతిఒక్కరు ఆదర్శం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102 జయంతి వేడుకల సందర్భంగా డిఆర్ఓ మోహన్ కుమార్‌తో కలసి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారాని తెలిపారు. సిపిఓ సాంబశివ రెడ్డి, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, ఉద్యాన శాఖ డిడి మధుసూదన్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరి పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి కమ్మ అభ్యుదయ సేవా సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు.

నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కార్యాలయంలో ఎమ్మెల్యే తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, అధికార ప్రతినిధి వి.సురేంద్ర కుమార్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. తరతరాలకు తరగని వెలుగు యుగపురుషుడు ఎన్‌టిఆర్ అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. కడప వేదికగా జరుగుతున్న రెండో రోజు మహానాడులో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కార్వేటినగరం: కార్వేటి నగరంలోని గాండ్ల మిట్ట కూడలి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి మాదిరాజు జనార్ధన్‌రాజు, జగన్నాథం ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాక్లెట్లు పండ్లు పంపిణీ చేశారు. కె సుబ్బారెడ్డి మేళం, రవి యాదవ్, మురళీకృష్ణ, వాసు దేవరెడ్డి, రాజేందర్ రెడ్డి, రవికుమార్, జగన్నాథం, ప్రసాద్, సందాని, కృష్ణయ్య పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో..

కుప్పం టౌన్ : ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని పలువురు తెలుగు తమ్ముళ్లు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించగా, కుప్పం పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ అభిమానులు నందమూరి తారక రామారావు 102వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

రామకుప్పం: ఆంధ్రుల ఆరాధ్యుడిగా కీర్తించబడిన వ్యక్తి నందమూరి తారకరామారావు అని టిడిపి నేతలు పేర్కొన్నారు. రామకుప్పంలోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. నాయకులు ఆంజనేయ రెడ్డి, పివి.సీతాపతి, రామకృష్ణప్ప, పద్మనాభరెడ్డి, సుబ్రీ, సలాం సబ్, రామలింగారెడ్డి, అక్బర్ సాబ్ పాల్గొన్నారు.

కుప్పంలో..

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రొంపిచర్ల మండల పరిధిలోని 8 సచివాలయాల సిబ్బందికి యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా కార్యక్రమంపై ప్రజలను చైతన్యపురుచుటకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. యోగ శిక్షణ నిపుణులు బి.శ్రావణి, ఎం.రంగారెడ్డి, పి.రసూల్, ఎల్.రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : ప్రతిరోజు యోగ చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని కుప్పం కమిషనర్ శ్రీనివాస రావు తెలిపారు. యోగ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణ పరిధిలో యోగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మూడు రోజులపాటు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలను ప్రజలలోనికి తీసుకెళ్లి ప్రాచుర్యం కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సోమల: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రామారావు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. పి.మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, మహేంద్ర, శంకర, పార్థసారథి పాల్గొన్నారు.

పలమనేరు: నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా పలమనేరు టిడిపి నాయకులు కార్యకర్తలు మార్కెట్ యార్డు వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి , కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్వేటినగరంలో..


రామకుప్పంలో..

యోగాతో ఆరోగ్యం

మండల విద్యాశాఖ అధికారిని శివరత్నమ్మ

పలమనేరులో..

ప్రజాశక్తి- సోమల: నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మనసుకు ప్రశాంతత కలుగుతుందని మండల విద్యాశాఖ అధికారిని శివరత్నమ్మ అన్నారు. మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు గదిలో బుధవారం ఉదయం మండలంలోని 15 సచివాలయాల సిబ్బందికి ఆశా కార్యకర్తలకు ఎంపిక చేసిన ప్రజలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కరుణానిధి, కందూరు వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నప్ప, యోగ శిక్షకులు చంద్రశేఖర్ యోగాలోని ఆసనాలు చేయడం వల్ల కలిగే లాభాల గురించి తెలియజేశారు. ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ మొత్తం 117 మందిని ఎంపిక చేసి యోగ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

పలమనేరు: పలమనేరులో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈనెల 31వ తేదీ వరకు జరుగుతుందని, సచివాలయ సిబ్బంది, వారి క్లస్టర్స్‌లో 100శాతం రిజిస్ట్రేషన్స్ పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంఈఓ బాల సుందరం, యోగా గురువు నందగోపాల్, ఫిజికల్ ట్రైనర్ అజీమ్, ప్రముఖ సాంఘిక సేవాకర్త శ్రీపురం శితారామయ్య, మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: రోజూ యోగా చేయడం వలన శరీరంలోని అవయవాలు శక్తివంతంగా మారతాయని, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీవో సతీష్ అన్నారు. బుధవారం గంగాధర నెల్లూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో యోగ ఇన్స్ట్రక్టర్లచే సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో లోకేష్, యోగా ఎంఓటిలు శంకర్, డాక్టర్ ఆషా అంజన్, మురళి, జయచంద్ర పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

సోమలలో

అంగరంగ వైభవంగా పుష్పయాగం

ప్రజాశక్తి- కార్వేటినగరం: చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి సంప్రదాయ పుష్పాలు, తులసి, మరుపం వంటి ఆరు రకాల పత్రాలు కలిపి టన్ను పుష్పాలతో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారికి బుధవారం పుష్పయాగం అంగరంగ వైభవంగా జరిగింది. అత్యంత శోభాయమానంగా సాగిన ఈ మహోత్సవాన్ని తిలకించి ఆశేష భక్తులు తన్మయత్వం చెందారు. కర్ణాటక, తమిళనాడుకు చెందిన భక్తులు పలువురు స్థానికులు పుష్పాలను విరివిగా విరాళంగా సమర్పించారు. బుధవారం ఉదయం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరి నీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కంకణబట్టు తరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పుష్పయాగం నిర్వహించారు. కనులారా తిలకించిన ఆశేష భక్తులు పారవశ్యం మునిగి పోయారు. డెప్యూటీ ఈవో నగరత్న, ఎఈవో రవి, అధికారి సురేష్ కుమార్, షరాబ్ బాబు సురేష్, వేదపండితులు దాశరథి, గోపాలచారి, శబరిష్ పాల్గొన్నారు.

రుతుస్రావంపై బాలికలకు అవగాహన

ప్రజాశక్తి- గుడిపాల: స్త్రీలో నెలసరి జరిగే రుతుస్రావం ఒక సాధారణ ప్రక్రియ అని బొమ్మసముద్రం పిహెచ్‌సి డాక్టర్ రష్మిత అనానరు. బుధవారం రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా పీహెచ్సీలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రష్మిత మాట్లాడుతూ శుచి శుభ్రత పాటిస్తే ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. ప్రతి ఏటా ప్రపంచ నెలసరి పరిశుభ్రత దినోత్సవం మే 28న నిర్వహించడం జరుగుతోందని, ప్రతి ఎంఎల్‌హెచ్‌సి కనీసం పది ఇళ్లను సందర్శించి బాలికలకు, మహిళలకు నెలసరి పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది శశికళ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్ట కోసం

వెల్లువెత్తుతున్న విరాళాలు

చెక్కును అందజేస్తున్న కిరణ్ రాయల్

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పద్మశ్రీ టూరింగ్ టాకీస్ కూడలిలో త్వరలో ఏర్పాటు చేయ తలపెట్టిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ట కోసం మండలంలోని బలిజ సోదరులు విరాళాలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సోమల మండలం వల్లిగట్ల పంచాయతీ పెద్దూరు గ్రామానికి చెందిన కిరణ్ రాయల్ తన వంతు సాయంగా రూ.5లక్షల రూపాయల చెక్కును కమిటీ సభ్యులు రఘుకు అందజేశారు. విగ్రహ నిర్మాణం ప్రతిష్ట చేయాలని అనుకున్నప్పటినుండి ఇప్పటివరకు లక్షలాది రూపాయల విరాళాలు కృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ట సంఘానికి అందుతూ వస్తున్నాయని, కిరణ్ రాయల్ రూ.5లక్షలు అందజేయడం హర్షించదగ్గ విషయమని కమిటీ సభ్యులు తెలిపారు.

మహానాడుకు బయలుదేరిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- ఐరాల: కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంకు ఐరాల మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు బయలుదేరారు. మండల సింగల్ విండో మాజీ అధ్యక్షులు శేషద్రి నాయుడు, మద్దిపట్లపల్లి మాజీ ఎంపిటీసీ నాగేశ్వర్ చౌదరి, కాణిపాకం పూర్ణచంద్రరావు, తిరువనంపల్లి బాబు నాయుడు, సింగల్ విండో మాజీ డైరెక్టర్ ప్రహల్లాద నాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కె.దేవరాజులు, బాలసుందరం, బాబు నాయుడు మహానాడుకు వెళ్లారు.

వెదురుకుప్పం: మండలం నుంచి బుధవారం టిడిపి పార్లమెంట్ వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి బి.వెంకటరమణారెడ్డి, జక్కదన పంచాయతీ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, కొమరకుంట పంచాయతీ బూత్ కన్వీనర్ ముని రాజారెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, యశ్వంత్ మహానాడుకు బయలుదేరి వెళ్లారు.

భక్తిశ్రద్ధలతో అర్జున తపస్సు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

మండలంలోని వివి పురం గ్రామ పంచాయతీ అంకనపల్లి గ్రామంలో శ్రీ ద్రౌపతి ధర్మరాజు ఆలయంలో మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. తయ్యూరు, పాయుకట్టు చుట్టుపక్కల గ్రామం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అర్చకులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సు మాను ఎక్కారు. అలాగే భాగవతార్ సీత మహాలక్ష్మి ద్రౌపది మాన సంరక్షణ సన్నివేశాన్ని వివరించిన విధానం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, గోపాల్ రెడ్డి, సర్పంచులు రఘునాథరెడ్డి, వరదమ్మ, దామోదర్ నాయుడు, ధనంజయులరెడ్డి, వైస్ సర్పంచ్ దామోదర్ ఆచారి, చంద్రారెడ్డి, రామనాథ రెడ్డి, లోకనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వ్యవసాయానికి సంబంధించిన రైతులకు వివిధ రకాల రుణాలను సకాలంలో మంజూరు చేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశం హల్‌లో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశం డిసిసి, డిఎల్ఆర్ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులకు వివిధ రకాల రుణాలను సకాలంలో మంజూరు చేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేసే సంక్షేమ పథకాలకు ఎస్‌బిఐ, సప్తగిరి గ్రామీణ, బ్యాంక్, కెనరా,యూనియన్, ఇండియన్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసి, ఇతరత్రా బ్యాంకుల కు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి బ్యాంకుల సహకరించాలని ఈ దిశగా బ్యాంకులు పనిచేయాలన్నారు. ప్రాథమిక రంగమైన వ్యవసాయ రంగంలో రైతులకు పంట పెట్టుబడిగా అవసరమైన పంటలకు రుణాలు, పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ కి షార్ట్ టర్మ్ క్రాప్ ప్రొడక్షన్ రుణాల మంజూరులో ప్రతి బ్యాంకుకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయటకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు. పంటల పెట్టుబడి సాయం కోసం రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ, పారిశ్రామిక ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల ద్వారా మేలు జరిగేలా అర్హులైన లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయాలనన్నారు. స్టాండప్ ఇండియా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ఇలా కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేసే పథకాలకు సంబంధించి జిల్లాలో ప్రతి బ్యాంకుకు కేటాయించిన లక్ష్యాలను విరివిగా చూపించాలన్నారు.

2025-26 వార్షిక రుణప్రణాళిక..

2025-26 సంవత్సరానికి జిల్లా క్రెడిట్ ప్లాన్ ప్రాధాన్యతా రంగంలో మొత్తం క్రెడిట్ వ్యయం రూ.17809.37 కోట్లు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం వివిధ ఆర్థిక కార్యకలాపాలను చేపట్టడానికి 815145 ఖాతాలకు రుణాలు ఇవ్వడం ఈ ప్రణాళిక లక్ష్యం. దీనికి అదనంగా, ప్రాధాన్యతలేని రంగానికి రూ.2787.17 కోట్లు కేటాయించారు, ఈ మొత్తం క్రెడిట్ వ్యయం రూ.17809.37 కోట్లు అవుతుంది. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు కేటాయింపులు రూ. 12195.27 కోట్లు, ఇది ప్రాధాన్యతా రంగం కింద వ్యయంలో 68.4శాతం. ఈ రంగం కింద దాదాపు 6.38 లక్షల మంది రైతులు, భూమి లేని కార్మికులకు సహాయం అందించబడుతుంది. చిన్న , సూక్ష్మ పరిశ్రమల రంగానికి కేటాయింపులు రూ.2216.07 కోట్లు, ఇది ప్రాధాన్యతా రంగ అవుట్‌లేలో 12.44శాతం. ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.220.81 కోట్లు కేటాయించారు. ఇది ప్రాధాన్యతా రంగ వ్యయంలో 1.35శాతం. వాణిజ్య బ్యాంకుల వాటా రూ.11843.43 కోట్లుగా నిర్ణయించబడింది, ఇది జిల్లా క్రెడిట్ ప్లాన్‌లో 66.50 శాతం వాటాను అందిస్తుంది. అనంతరం 2025 - 2026 వార్షిక రుణ ప్రణాళికకు సంబంధించి బుక్‌లెట్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో ఆర్‌బిఐ ఏపిఆర్‌ఓ రోహిత్ అగర్వాల్, నాబార్డ్ డిడి ఎం.సునీల్, ఎల్‌డి ఎం.హరీష్, డిసిసి కన్వీనర్ ఇంద్రరా, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళి కృష్ణ, వివిధ బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞానికి

భారతం మిట్ట సిద్ధం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం సోమల, ఇరికిపెంట పంచాయతీల పరిధిలో నేటి నుండి నిర్వహించనున్న మహాభారత యజ్ఞానికి భారతం మిట్ట సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. ఈనెల 29వ తేదీ గురువారం నుండి జూన్ నెల 15వ తేదీ వరకు మహాభారత యజ్ఞం నిర్వహించేందుకు నిర్వాహకులు నిర్ణయించారు. 29న ధ్వజారోహణంతో ప్రారంభమై భీష్మ ప్రతిజ్ఞ, జూన్ 7న ద్రౌపతి కళ్యాణం, 9న రాజసూయ యాగం, 11న అర్జున తపస్సు, 15న దుర్యోధన వధ ఘట్టాలు ఉంటాయని పగలు నాగరత్న భాగవతారించే హరికథ, రాత్రి పీలేరుకు చెందిన వెంకటేశ్వర నాటక కళామండలి వారిచే రాత్రి నాటకాలు జరుగుతాయని తెలిపారు. మహాభారత యజ్ఞం నిర్వహించే ప్రాంతంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో అమ్మవారి కటౌట్ శ్రీకృష్ణుడి కటౌట్ బ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులోని పలు సినిమా థియేటర్లలో అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా తినుబండారాల రేట్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించారు. ప్రేక్షకులకు థియేటర్ యాజమాన్యాలు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పలమనేరు తహశీల్దార్ ఇన్బునాధన్ తెలిపారు.

హాకింగ్స్‌లో ఆత్మీయ సమ్మేళనం

సమావేశంలో ప్రసంగిస్తున్న హాఫీజ్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని హాకింగ్స్ పాఠశాలలో కమిటీ అధ్యక్షులు హాఫీజ్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల యాజమాన్య కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బందితోపాటు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు శాంతిని కోరుకుంటూ దువ్వ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం పరిధిలో ముస్లిం కులస్తులు కలిసికట్టుగా ఉండాలని, ఎవరికి ఎలాంటి కష్టం ఏర్పడ్డ రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఏకమై పోరాటాలని పిలుపునిచ్చారు.

31న మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం

ప్రజాశక్తి- పుంగనూరు: మహాజన నేత మందకృష్ణ మాదిగ ఘనస్వాగతం పలుకుదామని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ బి.నరసింహులు బుధవారం తెలిపారు. మాదిగ, మాదిగల ఉపకులాల ఉజ్వల భవిష్యత్ కోసం గత 30 సంవత్సరాల నిరంతరం అలుపెరుగనిపోరాటం చేసి మాదిగల ఉనికిని, అస్థిత్వాన్ని ఆత్మగౌరవాన్ని అత్యున్నత శిఖరాలకు చేర్చిన నేత మందకృష్ణ మాదిగ అన్నారు. ఈనెల 27న భారతదేశ అత్యున్నత పౌరపురస్కారం స్వీకరించి ఈనెల 31న వరంగల్ కేంద్రానికి వస్తున్న సందర్భంగా పుంగనూరు నియోజకవర్గంలోని 6మండలాల నుండి అనుబంధ సంఘాలు కార్యకర్తలు సామాజికవాదులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలం ప్రధాన కార్యదర్శి (చిట్టి) వెంకటరమణ, అండిగానిపల్లె సుబ్రమణ్యం, మురళి, ప్రసాద్, రఘు, గోవర్ధన్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు భూసేకరణ

గిట్టుబాటు ధర ఇవ్వాలంటున్న రైతులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

సమావేశంలో పాల్గొంటున్న ఆర్డీవో భవాని

తిరుపతి- కుప్పం జాతీయ రహదారి పరిసరాలలో ఉన్న గ్రామాల సమీపంలో బైపాస్ పనులలో భాగంగా ప్రభుత్వం భూములను రైతుల నుండి స్వాధీనపరచుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. బుధవారం పలమనేరు ఆర్‌డిఓ పి.భవాని బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొంతమంది రైతులు తమకు మాత్రం తక్కువ నష్టపరిహారాన్ని ఇస్తున్నారని ఆర్డీవోకు విన్నవించుకున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ధరను నిర్ణయించడం జరిగిందని, ఒక రైతుకు ఎకరానికి కోటి 30 లక్షలు ఇస్తుంటే పక్కనే ఉన్న ఇంకో రైతుకు 20 లక్షలు మాత్రమే ఇచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది కాదని తమకు కూడా అందరి లాగే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. దీనికి ముఖ్య కారణం ల్యాండ్ కన్వర్షన్ చేసుకోలేదని, రియల్ ఎస్టేట్ దందా చేయాలనుకునే వాళ్ళు మాత్రం ఈ రెవెన్యూ ల్యాండ్ కన్వర్షన్ చేసుకున్నారని, దానివలననే వారికి ఎక్కువ మొత్తంలో డబ్బులు పడ్డాయని, తమకు మాత్రం తక్కువ స్థలం ఉంది కాబట్టి ఇండ్లు కట్టుకోవడానికి ఆ స్థలాలు ఉంచుకోవడం జరిగిందని రైతులు తెలియజేశారు. రైతుల విన్నపాన్ని ఆలకించిన ఆర్‌డిఓ వారి వద్ద నుండి రాతపూర్వకంగా అర్జీని స్వీకరించడం జరిగింది. అనంతరం ఆర్‌డిఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందరికీ ఒకే విధమైన చట్టపరమైన నిర్ణయాలు తీసుకుంటుందని, ఈ నిర్ణయం ఎవరో తీసుకున్నది కాదని చట్ట ప్రకారం ఎవరికి ఎంత రావాలో అంతే వస్తుందని ఆమె తెలియజేశారు.

ఊరికి దిష్టి..! ఈ.. 'బృందావనాలు'

బృందావపం తొట్టెల్లో మద్యం బాటిళ్లు

ప్రజాశక్తి - ఏర్పేడు: చెత్త నుంచి సంపద వస్తుందో లేదో గానీ, మందుబాబుల అడ్డాగా ఉన్న బృందావనాల్లో మద్యం బాటిళ్లు అమ్ముకుంటే పదో పరకో ఆదాయం రాక మానదు.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతోంది.. టిడిపి హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు' మండలంలో నిరుపయోగంగా మందుబాబుల అడ్డాగా ఉన్నాయి. ఒక బృందావనం.. పది మంది మందుబాబులు అన్న చందాన తయారయ్యాయి. టిడిపి హయాంలో నిర్మిస్తే వైసిపి గాలికొదిలేయడం, వైసిపి హయాంలో నిర్మిస్తే టిడిపి గాలికొదిలేయడం వల్ల లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు గాలికి కొట్టుకుపోవడమే గాకుండా, బృందావన షెడ్లు శిథిలావస్థలో రేపోమాపో కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఏర్పేడు మండలంలో 40 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటివరకూ 36 గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా టిడిపి హయాంలో నిర్మించారు. గతంలో పాపానాయుడుపేటలోని ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రం ప్రకృతి వైపరీత్యాల వల్ల పూర్తిగా ధ్వంసమయ్యింది. ప్రస్తుతం 35 కేంద్రాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యంగా మారిన ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామ పంచాయతీల్లో నిర్మించిన అన్ని ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని భావించింది. ప్రతి నెలా మూడో శనివారం గ్రామ పంచాయతీ అధికారులు, మండలాధికారులు, ఉన్నతాధికారులు కలిసి 'స్వచ్ఛ ఆంధ్ర... స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తడిపొడి చెత్త ద్వారా సంపద తయారు చేసే ప్రక్రియ గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నది లక్ష్యం. అయితే క్షేత్రస్థాయిలో ఈ పరిస్థితి లేదు. చీపుర్లు పట్టుకుని 'షో' ఇస్తూ ఫొటోలు తీసుకోవడం వల్ల 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' తూతూమంత్రంగానే మండలంలో నడుస్తోందన్న విమర్శలు లేకపోలేదు. మండలంలోని మోదులపాలెం గ్రామ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రం నిరుపయోగంగా మారి ముళ్లపొదలతో, మద్యం బాటిళ్లతో దర్శనమిస్తూ, చెత్తను నింపే తొట్టెలు పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరువగా ఉన్నాయి. తడిపొడి చెత్తను వేరుచేసి ఎరువులను తయారు చేసి, రైతులకు అమ్మడం ద్వారా సంపద సృష్టించాలన్న లక్ష్యంతో నిర్మించిన ఈ బృందావనాలు పంచాయతీల్లో దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. ఇఓఆర్‌డి రమణకుమార్‌ను వివరణ కోరగా సర్పంచులు సపోర్టు చేయడం లేదని చెప్పడం గమనార్హం. పొలిటికల్ ఇబ్బంది ఉందని తెలిపారు.

పంచాయతీకి నిధుల్లేవు :

యానాది జయరామయ్య, సర్పంచి

పంచాయతీ నిధులు కావలసినంత లేకపోవడంతో మరమ్మతుకు గురైన ట్రైసైకిళ్లను, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని మనుగడలోకి తీసుకురాలేకపోతున్నాం. ప్రస్తుతం చెత్త సేకరణ ప్రక్రియ అమల్లో లేదు.

క్రైం న్యూస్

వాహనాల దొంగలు అరెస్ట్

రూ.18 లక్షలు విలువగల వాహనాలు సీజ్

విలేకర్ల సమావేశంలో ముద్దాయిలను చూపుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి- గుడిపాల: ట్రాక్టర్ దొంగలను అరెస్టు చేసినట్లు గుడిపాల ఎస్సై రామ్మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి తుమ్మలవారిపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ నాయుడుకు చెందిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన గుడిపాల పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక పరిజ్ఞానంతో ఆ ట్రాక్టర్ చిత్తూరు మీదుగా కలికిరి వైపు వెళ్లినట్లు గుర్తించారు. ముద్దాయిలైన అవినాష్ రెడ్డి, నితీష్ కుమార్‌రెడ్డి, మరోవ్యక్తి మైనర్ బాలుడును బుధవారం చీలాపల్లి క్రాస్ రోడ్ వద్ద అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరు కలికిరి మండలం పారపట్ల గ్రామానికి చెందిన వారిని తెలిపారు. వీరిపై ఇప్పటికే మన జిల్లాలో సుమారు 15 మోటార్ సైకిల్స్ దొంగతనం కేసు, చైన్స్ స్నాచింగ్ కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వీరి ముగ్గురు కలిసి ట్రాక్టర్ మీద ఉన్న నెంబర్ ప్లేట్‌ని తీసి ఎవరికి అనుమానం రాకుండా బ్లూ కలర్ పెయింట్ వేసి తమిళనాడులో అమ్మడానికి పోతుండగా వీరిని అరెస్ట్ చేసినటు తెలిపారు. అనంతరం ముద్దాయిలను విచారించగా వివిధ ప్రాంతాల్లో దొంగతనం చేసిన రెండు రాయల్ ఎన్ఫీల్డ్, 2 బజాజ్ పల్సర్, ఒక స్ప్లెండర్ ప్లస్, ఒక ప్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మోటార్ సైకిల్ విలువ 8 లక్షలు, ట్రాక్టర్ విలువ సుమారు రూ.10లక్షలు మొత్తం రూ.18 లక్షల విలువగల వాహనాలను సీజ్ చేసి వారిని రిమాండ్ పంపించడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: కటింగ్ నడిపే వ్యక్తిపై దాడికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ తెలిపారు. మండలంలోని పిళ్ళారి కుప్పం క్రాస్ రోడ్డులో కటింగ్ షాపులో పనిచేసే ఓ వ్యక్తిని చిన్న తయ్యూరు గ్రామానికి చెందిన చందు, ప్రశాంత్, ఉదయ్ ముగ్గురు మద్యం తాగి కటింగ్ షాపులో పనిచేసే వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సంఘటన గురించి తెలుసుకున్న నగిరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ఆదేశాల మేరకు ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ దాడికి పాల్పడిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి, బుధవారం వారిని అరెస్టు చేసి తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కి పంపారు. ఈ సందర్భంగా ఎస్సై సుమన్ మాట్లాడుతూ ఎవరైనా ఇలాంటి అసంఘటిత కార్యక్రమాలకి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోమలలో నాకాబందీ

వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివశంకర్

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో ఎస్సై శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు నాకాబంది నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులను హెల్మెట్ ధరించాలని, రహదారి సూత్రాలు పాటించాలని, కార్లు, లారీలు, టెంపోల డ్రైవర్ల నుండి రికార్డులు పరిశీలించి వాహనాల రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పోలీసులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో నిర్మాణాలను పరిశీలించిన టిటిడి ఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: స్విమ్స్‌లో నిర్మాణంలో ఉన్న భవనాలను టిటిడి ఈవో జె. శ్యామల రావు అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ముందుగా రోగుల సహాయక వసతి గహంలోని రోగులు వేచియుండే గదులు, భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. అక్కడే వున్న రోగులతో అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. స్విమ్స్ అందిస్తున్న వైద్య సేవలపై రోగులు సంతోషం వ్యక్తం చేశారు. రోగులు ఏ ప్రాంతం నుండి వచ్చారు, ఎలాంటి వైద్యం కోసం వచ్చారు తదితర విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, సిటి సర్జరీ తదితర వైద్య సేవల కోసం నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు.

నోటీసు

ఇందుమూలంగ తెలియజేయడమేమన గా ఎస్ఆర్ పురం మండలం 49. కొత్తపల్లి మిట్ట గ్రామం నందు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం కలదు. ఈ దేవాలయమును దేవాదాయ శాఖ యందు సెక్షన్ 43 ప్రకారం రిజిస్టర్ చేయదలచినాము. ఇందుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నయెడల సహాయ కమిషనర్ దేవాదాయ శాఖ చిత్తూరు వారికి 15 రోజుల లో విన్నవించుకోవాల్సిందిగా కోరుతున్నాము..

ఆలయ కమిటీ
49. కొత్తపల్లి మిట్ట,
ఎస్ఆర్ పురం మండలం